
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 12 మే 2025



గంగాధరలో పీస్ కమిటీ సమావేశం

గంగాధర, మే 11 (ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి అన్ని మతాల పెద్దలు హాజరుకాగా వారి నుద్దేశించి ఎస్సై మాట్లాడారు. సమాజంలో అన్ని మతాల వారు కలిసి మెలిసి ఉండి అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు.

ప్రమాదకర ప్రయాణం

- రోడ్డు పక్కన వ్యవసాయ బావి
- కనిపించకుండా పిచ్చి మొక్కలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



మానకొండూర్‌లో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయబావి కనిపించకుండా ఉన్న చెట్లు

మానకొండూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారిలో మానకొండూర్ శివారులోని రోడ్డు పక్కన ఓ వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. చుట్టూ పిచ్చి చెట్లు మొలవడంతో ఆ బావి ప్రయాణికులకు కనిపించడం లేదు. ఆ చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపంచడం లేదు. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ చెట్టును తొలగించలేదు, కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. ఈ రోడ్డుపై ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ప్రమాదాలు జరుగకముందే అధికారులు చెట్ల కొమ్మలను తొలగించి బావి వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి

కరీంనగర్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వంచ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో టీడీపీ శ్రేణులు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని అన్నారు. గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని, అభివృద్ధి సంక్షేమ ఫలాలు పొందాలని ఎదురుచూస్తున్నారని అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా పోటీ చేయాలనుకునేవారు పార్టీ శ్రేణులు, ప్రజలతో సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు పర్లపెల్లి రవీందర్, నాయకులు కళ్యాడపు ఆగయ్య, రొడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని బోరు

మానకొండూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో ఓ బోరు మరమ్మతులకు నోచుకోకపోవడంతో తాగునీటి కోసం ఎస్సీ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులకు తాగు నీరందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన బోరు రెండేళ్ల క్రితం చెడిపోయింది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. మరమ్మతుల కోసం వచ్చిన సిబ్బంది హ్యాండిల్ విప్పుకుని పోయారు. చెడిపోయిన బోరుకు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో వేసవిలో నీటి అవసరాల కోసం వ్యవసాయబావులపై ఆధారపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఖాదర్‌గూడెంలో మరమ్మతులకు నోచుకోని బోరు

ప్రజల వద్దకు పోలీసులు

- కమిషనరేట్‌లో విజిబుల్ పోలీసింగ్
- క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాల పెంపు లక్ష్యంగా ముందుకు



గ్రామాల్లో పోలీసుల కవాతు

కరీంనగర్ క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసులు దగ్గరవ్వాలని, ఎక్కడ సమస్యలుంటే అక్కడికి వెళ్లి పరిష్కరించాలని డీజీపీ జితేందర్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సీపీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. పోలీసు అధికారులు కార్యాలయాలలోనే ఉండకుండా క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని ఎక్కడికక్కడ పరిష్కారిస్తున్నారు.

కాలనీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ప్రార్థనా మందిరాలు, షాపింగ్ కాంప్లెక్స్ మార్కెట్ ప్రాంతాల వంటి రద్దీ ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలు పెంచుతున్నారు. దీనిలో భాగంగా పట్టణాల్లోని కాలనీల్లో, గ్రామాల్లో సైబర్ నేరాలపై, డ్రగ్స్, మూఢనమ్మకాలు, తదితర నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండలస్థాయిలోనూ రోజుకో గ్రామం, పల్లెకు వెళుతున్న పోలీసులు స్థానికులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. స్థానికులతో సమావేశాలు ఏర్పాటు చేసి వివిధ మోసాలు జరిగే తీరు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ముమ్మరంగా తనిఖీలు

నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద స్టాటిక్ పికెట్స్‌తోపాటు పలుచోట్ల వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణాల్లోని కాలనీల్లో, గ్రామాలతో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడితే వారిని విచారిస్తూ వేలిముద్రలు సేకరించి డాటాబేస్‌లో అప్‌లోడ్ చేస్తూ గతంలో ఏవైనా నేరఘటనల్లో ప్రమేయం ఉందా అనేది నిర్ధారించకుంటున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో పోలీసులతో పాటు డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ బృందాలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. తనిఖీలతో పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌లను వినియోగిసున్నారు. ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా సంచరించే బస్టాండ్లు, ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో నిరంతర పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. సంఘ విద్రోహశక్తులు, మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు.

పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా హెచ్చరికలు, సూచనలు

బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా అనుమానిత వ్యక్తులు లేదా వస్తువుల గురించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు, సూచనలు జారీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచారు. సోషల్ మీడియాపై నిరంతర నిఘాపెట్టారు. గ్రామాల్లోనూ పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గతంలో నక్సల్స్ సమస్య ఉన్న సమయంలో పోలీసులు గ్రామాలకు వెళ్లడానికి గ్రూపుగా చాలా జాగ్రత్తలు తీసుకునేవారు. నక్సల్స్ ప్రాబల్యం తగ్గడంతో పోలీసులు మారుమూల గ్రామాలకు కూడా ఒంటరిగా వెళుతున్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామానికి వెళుతై బ్లూకోల్ట్స్ పోలీసులు రౌండ్ ద క్లాక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

పార్కుపై పట్టింపేది?

- తుప్పు పట్టిన పరికరాలు

గంగాధర, మే 11 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల సరదా ఆటల కోసం ఏర్పాటు చేసిన గంగాధర మినీ పార్కు పరికరాలు తుప్పు పట్టి ప్రమాదకరంగా మారాయి. కొన్ని విరిగిపోయాయి. మరికొన్ని పరికరాలు ఎప్పుడు విరుగుతాయోనని చిన్నపిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఉదయం, సాయంత్ర సమయాల్లో తల్లిదండ్రులు చిన్నారులను ఇక్కడ ఆటలాడిస్తున్నారు. పార్కులోని సర్క్యులర్ స్వింగ్ ఒకవైపు విరిగి ప్రమాదకరంగా మారింది. ఇక రౌండ్ స్వింగ్‌లో ఆరు సీట్లు ఉన్నాయి. ఇందులో ఏకకాలంలో ఆరుగురు చిన్నారులు కూర్చుని తిరుగుతూ ఆడుతుంటారు. ఈ స్వింగ్‌లో కేవలం రెండు సీట్లు మాత్రమే ఉండి మిగతావి విరిగిపోయాయి. ఊయలలో ఇద్దరు ఊగడానికి ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి తుప్పుపట్టి విరి పోయింది. రెండవది కూడ విరగడానికి సిద్ధంగా ఉంది.



ఇరుసు నుంచి విరిగిన సర్క్యులర్ స్వింగ్

పార్కుల పరిస్థితిపై అధికారులకు చెప్పినా కనీసం స్పందించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎలాంటి ప్రమాదం జరగక ముందే తుప్పు పట్టిన ఆట పరికరాలను తీసి కొత్తవి వేయాలని తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.



రౌండ్ స్వింగ్‌కు ఊడిన సీట్లు



తెగిన ఊయల

ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట

రూ. 40 కోట్లు స్వాహా

- నిందితుడి ఇంటి ఎదుట బాధితుల ధర్నా



సురేష్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

కరీంనగర్ క్రైం, మే11(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట 100 మంది వద్ద 40 కోట్ల రూపాయల వరకు డబ్బులు తీసుకుని ఏడాదిగా జాడలేకుండా పోయాడని బాధితులు ఆదివారం సప్తగిరి కాలనీలోని నిందితుడి ఇంటి వద్ద ధర్నా చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... సప్తగిరి కాలనీకి చెందిన మొలుగూరి సురేష్ స్థానికులను నమ్మించి ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌లో డబ్బులు పెడితే త్వరగా రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించాడు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మరికొందరికి చెప్పాడు. ఇలా 100 మంది వద్ద 40 కోట్ల రూపాయలు తీసుకున్నాడు. కొంతకాలంపాటు డబ్బులకు వడ్డీ చెల్లించడం, ఉద్యోగం ఇచ్చిన వారికి వేతనాలు ఇచ్చాడు. అనంతరం ఎవరికీ చెప్పకుండా మాయమయ్యాడు. ఏడాది కాలంగా సురేష్ బాధితులకు వడ్డీ ఇవ్వడంలేదు. వేతనాలు చెల్లించడం లేదు. దీనిపై కరీంనగర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. ఇప్పటి వరకు సురేష్ జాడ తెలియలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు



ఖాళీగా ఉన్న తీగలగుట్టపల్లి కొనుగోలు కేంద్రం

కరీంనగర్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. ఇప్పటికే రెండు, మూడు కేంద్రాల్లో పూర్తిగా కొనుగోళ్లు పూర్తి కాగా మూసివేసేందుకు సిద్ధమయ్యారు.అన్ని కొనుగోలు కేంద్రాల్లో చివరి దశకు చేరగా నగునూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పేరుకుపోయింది. దీంతో కాంటాలు కాని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ యాసంగిలో మండలంలో 13,210 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 2,100 ఎకరాల్లో సన్నాలు, 11,110 ఎకరాల్లో దొడ్డురకం వరి పంటను సాగు చేశారు. మొత్తం 20 వేల మెట్రిక్ టన్నుల దాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అంచనా వేశారు. మండలంలో 20 కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను గత నెల 18న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. గత సీజన్ లో 1.49 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించగా ప్రస్తుతం ఇప్పటి వరకు 1,45,534 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. ఇందులో కరీంనగర్ వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో ఎనిమిది గ్రామాల్లో 1,605 మంది రైతుల నుంచి 81,362 క్వింటాళ్లు కొన్నారు. దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాల్లో 40,710 క్వింటాళ్లు, ఐకేపి ఆధ్వర్యంలో ఆరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 23,462 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. నగునూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పేరుకుపోయింది. ఇప్పటికే మొగ్దుంపూర్‌లో కొనుగోలు కేంద్రం మూసి వేశారు.

వృత్తి పేరే.. ఇంటి పేరు..

- ఉపాధి ఆధారంగా మారుతున్న నామధేయాలు
- అసలు పేరు కొసరుగా మారుతున్న వైనం

7

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరో ఇద్దరికి గాయాలు


నిచిత్ వర్మ (ఫైల్)

వెల్గటూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం శాఖాపూర్ వద్ద వరంగల్-రాయపట్నం రాష్ట్ర రహదారిపై ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో నిచిత్‌వర్మ(17) అనే బాలుడు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం రాజక్కపల్లి గ్రామానికి చెందిన దొరిశెట్టి నిచిత్‌వర్మ(17), అతడి స్నేహితుడు పత్తిపాక కీర్తి చంద్ర(17) శాఖాపూర్‌లోని వాటర్‌ప్లాంట్‌కు స్కూటీపై నీళ్ల కోసం వెళ్లారు. బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన అన్నాజి విక్రం(20) అనేవ్యక్తి మరొకరితో కలిసి కరీంనగర్ వైపు బైక్‌పై అతివేగంగా వెళ్తూ స్కూటీని ఢీకొట్టాడు. స్కూటీపై వెళ్తున్న నిచిత్‌వర్మ, కీర్తిచంద్రలకు తీవ్రగాయాలు కాగా కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికితరలించారు. నిచిత్‌వర్మ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కీర్తి చంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా మృతుడు నిచిత్‌వర్మ ప్రస్తుతం ఇంటర్మీడియట్ పూర్తిచేసి, హనుమాన్ మాల ధరించాడు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి దొరిశెట్టి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైకు నడిపిన అన్నాజి విక్రమ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


ముత్యం రెడ్డి (ఫైల్)

గన్నేరువరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామపరిధిలోని దుబ్బపల్లికి చెందిన ఏలేటి ముత్యంరెడ్డి (63) పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఎస్‌ఐ తాండ్ర నరేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేటి ముత్యం రెడ్డి గతంలో అడవిపంది దాడిలో గాయపడగా నాడీవ్యవస్థ దెబ్బతింది. కొద్దిరోజులు మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో అనారోగ్యసమస్యలు తీవ్రమవడంతో మన స్థాపానికి గురై శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ముత్యంరెడ్డి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

పెద్దపల్లి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్రాంపల్లి గ్రామానికి చెందిన అటుకుల రవిందర్‌రెడ్డి (45) అనే రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం రవిందర్‌రెడ్డి వ్యవసాయ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడని, ఇటీవల కూతురు వివాహం చేయగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయని మద్యానికి బానిసైనట్లు తెలిపారు. ఈనెల 9న రాత్రి పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి


మృతి చెందిన మల్లేష్

ముత్తారం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైదంబండ గ్రామానికి చెందిన పందుల మల్లేష్ (17) అనే యువకుడు ఆదివారం ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ గోపతి నరేష్ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన పందుల శేఖర్‌కు చెందిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసేందుకు మల్లేష్ వెళ్ళగా వడ్లను నిమ్మల కుమార్ చెందిన ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్నారు. ఒక్కసారిగా ట్రాక్టర్ ముందుకు వెళ్ళడంతో అదుపు చేసేందుకు మల్లేష్ ప్రయత్నించగా టైర్ కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో అక్కడే ఉన్న రైతులు మల్లేష్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కోరుట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గౌడుగు రాజవ్వ(75) అనే వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆదివారం మృతిచెందినట్లు కోరుట్ల ఎస్‌ఐ2 రామచంద్రుడు తెలిపారు. రాజవ్వ కోరుట్ల పట్టణంలో కూలి పని చేస్తూ జీవిస్తోంది. అర్బన్ కాలనీ వద్ద జాతీయరహదారిని దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రాజవ్వ కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

తిమ్మాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన ఓవ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరావు ఆదివారం తన భార్యకు ఫోన్‌చేసి తను గడ్డిమందు తాగినట్లు తెలిపాడు. వెంటనే ఆమె స్థానికులకు సమాచారం అందించగా వారు సంగంపల్లి గ్రామశివారులో అపస్మారకస్థితిలో ఉన్న తిరుపతిరావుని గుర్తించారు. వెంటనే అతడిని 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కొన్ని నెలలక్రితం తిరుపతిరావు కొడుకు నిఖిల్‌రావు ఆన్‌లైన్‌లో గేమ్ ఆడి డబ్బులను పోగొట్టుకొని మన్నెంపల్లి శివారులో బావిలోపడి మృతిచెందాడు. అప్పటి నుంచి మనస్థాపంతో ఉన్న తిరుపతిరావు ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇదిలాపూర్ గ్రామ శివారులో ఆదివారం కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన చొప్పరి సదానందం ద్విచక్ర వాహనంపై వస్తుండగా జమ్మికుంట నుంచి గోదావరిఖనికి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు సదానందం కాళ్లకు,తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన సదానందంను ఆటోలో మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లికి తరలించారు. గ్రామస్థులు కారును అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


మణిచరణ్(ఫైల్)

రాయికల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో ఈతకు వెళ్లి జగిత్యాలకు చెందిన మణిచరణ్ (13) ఆదివారం మృతిచెందాడు. జగిత్యాలకు చెందిన బింగిరాధ చిన్న కుమారుడు మణిచరణ్ రాయికల్‌లోని అమ్మమ్మ ఇంటివద్ద ఉండి స్థానికప్రైవేట్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు. కుమ్మరిపెల్లిలోని బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లి ఈత కొడతామని వ్యవసాయ బావిలో దిగగా ఈతరాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు.

రోగుల సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



జగిత్యాల/కళ్యాణ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): రోగుల సంరక్షణలో కనిపించే దేవుళ్లలా పని చేసేవారు నర్సులు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా రోగులకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నర్సులు పని చేస్తున్నారు. అంతర్జాతీయ నర్సింగ్ డేను యేటా మే 12న ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా నర్సింగ్ డేను జరుపుకుంటారు. తమకు ఎన్ని కష్టాలున్నా విధుల్లో అంకితభావంతో పని చేసేవారు నర్సులు. కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎంతో మందిని కాపాడారు. ప్రపంచంలో ఆరోగ్య కార్యకర్తల్లో సగానికి పైగా నర్సులు ఉన్నారు. విధుల్లో ఒత్తిడికి గురి కావడం, రోగుల సంరక్షణలో ఏదైన జరుగరానిది జరిగినప్పుడు రోగి బంధువులు నర్సులనే లక్ష్యం చేస్తూ దాడులకు, బెదిరింపులకు పాల్పడడం, కొన్ని సందర్భాల్లో నర్సులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. రోగులకు చికిత్స అందించే సమయంలో వారికి సరైన రక్షణ, సౌకర్యాలు లేకపోవడం, రోగుల నుంచి సంక్రమించే వ్యాధులను వారిని వేధిస్తున్నాయి. ఎందరో అంటువ్యాధుల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా వృత్తినే పరమావధిగా భావించే నర్సులు రోగులకు అపారమైన సేవలందిస్తూ వారి ప్రాణాలను కాపాడడంలో నర్సుల పాత్ర కీలకం.

సేవ చేయడమే లక్ష్యం...

- సౌందర్య, నర్సింగ్ సూపరింటెండెంట్



ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రోగులకు సేవలు అందించడమే తమ లక్ష్యం. కరోనా సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించా. విధుల్లో ఇబ్బంది అయినా తట్టుకుంటున్నాం.

మిలటరీలో నర్సుగా చేరుదామనుకున్నా...

- సుమలత, నర్సు



ఆర్మీలో పని చేసే వారికి సేవ చేసేందుకు మొదట మిలిటరీలో నర్సుగా చేరాలనుకున్నా. ప్రయత్నం విఫలమయ్యింది. ఎంఎస్ నర్సింగ్ చేసి ప్రభుత్వ నర్సుగా నాలుగు సంవత్సరాల క్రితం జాయిన్ అయ్యా. ఎందరో రోగులు అవస్థతో వస్తుంటారు. వారికి రోగం నయం చేసిన తరువాత వారు పెట్టే దీవెనలు ఆనందాన్ని కలిగిస్తాయి.

రోగులను కంటికి రెప్పలా కాపాడతాం

-ప్రమిత, హెడ్ నర్సు, వైద్య సేవా అవార్డు గ్రహీత, రాయికల్



కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి కొవిడ్ వార్డుల్లో విధులు నిర్వహించాం. మేము దగ్గరుండి అన్ని రకాలుగా భరోసా కల్పించగా ఎంతో మంది మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి వెళ్లడం సంతోషాన్నిచ్చింది. డాక్టర్లు సూచించిన చికిత్సలను రోగులకు అందిస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ అంకిత భావంతో సేవలు అందిస్తున్నాం.

రెండు బైక్‌లు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రెండుబైక్‌లు ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన అక్కపల్లి లింబాద్రి బైక్‌పై కేశవపట్నం మెయిన్ రోడ్డుకు వస్తుండగా అంబేద్కర్ చౌరస్తా నుంచి కేశవపట్నంలోకి వెళ్తున్న బైక్ ఢీకొంది. దీంతో లింబాద్రి తన బైక్‌పై నుంచి కిందపడి పోయాడు. ఈ ఘటనలో లింబాద్రి కాలు విరిగింది. గమనించిన స్థాని కులు వెంటనే 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బీట్ ఆఫీసర్‌పై దాడి.. ఒకరిపై కేసు నమోదు

చందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలపను తరలి స్తున్న వ్యక్తిని అడ్డుకున్న అటవీశాఖ అధికారిపై ఓ కలప స్మగ్లర్ దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం దేవునితండాలో శనివారం జరిగింది. చందుర్తి ఎస్‌ఐ అంజయ్య కథనం ప్రకారం దేవునితండా చెందిన అజ్మీరా తిరుపతి అనే వ్యక్తి సనుగుల అటవీ ప్రాంతం నుంచి కలపను తరలిస్తుండగా బీట్ ఆఫీసర్ బాలకృష్ణ అడ్డుకోవడంతో తిరుపతి అటవీశాఖ అధికారిపై దాడికి పాల్పడ్డాడు. బీట్ ఆఫీ సర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఓదెల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గుంపులలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. గుంపుల సమీపంలోని మానేరువాగు నుంచి ఇసు కను అనుమతి లేకుండా తరలిస్తున్నారనే సమాచారంతో వెళ్లి పరిశీలించగా ఇసుక ట్రాక్టర్ పట్టుబడిందని, అలాగే సంబంధిత వ్యక్తిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.


గుంపులలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

షాపులోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

హుజూరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ఆదివారం తెల్లవారు జామున గ్రానైట్ లారీ షాపులోకి దూసుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ నుంచి గ్రానైట్ లారీ హుజూరాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు బయటకు వెళ్తుండగా, బస్సును చూసిన గ్రానైట్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో పక్కనే కరెంట్ స్తంభాన్ని ఢీ కొని షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతింది. షాపులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే బస్టాండ్ ఏరియాలో సుమారు 6గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీని తొలగించారు. లారీడ్రైవర్‌పై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.


హుజూరాబాద్‌లో షాపులోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

రోడ్డు పక్కన నిల్చున్న యువతిని ఢీకొట్టిన కారు

● సంఘటన స్థలంలోనే మృతిచెందిన యువతి

● మరొకరి పరిస్థితి విషమం


మృతి చెందిన మౌనిక

చిగురుమామిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామ శివారులో హుస్నాబాద్-కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ట్రైనీ ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా జాబితాపూర్‌కు చెందిన మౌనిక(24) తన సోదరుడితో కలిసి సుందరగిరి గ్రామానికి చెందిన వారి బంధు వుల వివాహానికి వచ్చారు. గ్రామశివారులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి హాజరై భోజనం చేసి సోదరుడితో కలిసి బయటకు వచ్చి రోడ్డు పక్కన నిల్చున్నారు. ఇంతలో హుస్నాబాద్ నుంచి కారు(టీఎస్ 02ఇజడ్9907) వేగంగా వచ్చి ఇద్దరిని ఢీకొట్టింది. దీంతో మౌనిక సంఘటన స్థలం లోనే మృతిచెందింది. మౌనిక సోదరుడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమ్మిత్తం కరీంనగర్‌కు అంబులెన్స్‌లో తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోరుట్ల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని సీసీఎస్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. కాకతీయ కాలువను ఆనుకొని ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించి వారి వద్ద రూ.12,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

వీణవంక, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన అమ్మ మహేందర్ తన ఇంటి పక్కన నిర్మాణ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎజ్జారాజు అడ్డుకున్నాడు. బూతులు తిడుతూ కర్రతో దాడి చేయగా మహేందర్ తలకు గాయాలయ్యాయి. మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్‌ఐ సాయికృష్ణ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

● వేములవాడలో పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● ధర్మపురిలో పూజల్లో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

వేములవాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయం నాంపల్లి గుట్టపై వెలసిన శ్రీ భూనిలా సహిత లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, హోమం, బలిహరణం నిర్వహించారు. కొండపైనున్న ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను పూలతో అందంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు డప్పుచప్పుల్లు, కళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ , రాజన్న ఆలయ ఈవో కె వినోద్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు రాచకొండ రామాచారిసంధ్యారాణి దంపతులు కన్యాదాతలుగా వ్యవహించగా, అర్చకులు రాచకొండ విజయేంద్రచారి, రామకృష్ణాచారి, హర్షవర్దనచారి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతోపాటు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా కరీంనగర్ సజ్జప్ప కళాక్షేత్రం, సజ్జప్ప కూచిపూడి డ్యాన్స్, మ్యూజిక్ అకాడమీ వారి కళాప్రదర్శనలు అందరిని అలరించాయి. కళాకారులను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సన్మానించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి వరంగల్‌కు చెందిన తోపుచెర్ల శ్రీనాథ్‌స్వాతి దాతలుగా వ్యవహరించగా. ముస్తాబాద్‌కు చెందిన రాసమడుగు నర్సింగారావు భక్తులకు తాగునీరు అందించారు. కల్యాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, అశోక్, ఈఈ రాజేశ్, డీఈ మహిపాల్ రెడ్డి, సూపరిండెంట్లు వెంకటరాజు, పూజిత, ఆలయ ఇన్‌చార్జి నరేందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


వేములవాడలో విశేషాలంకరణలో స్వామి వారి ఉత్సవమూర్తులు

ధర్మపురిలో.. నరసింహస్వామి జయంత్యుత్సవాలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసకపూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాలకు, శ్రీ స్వామి వారలకు, దేవాలయాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో రెండు లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి ఆరంభమైన నరసింహ నవరాత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

● హోమంలో పాల్గొన్న మంత్రి దామోదర..

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద నిర్వహించిన నరసింహ హోమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పాల్గొ న్నారు. లోకక్షేమార్థం, కుటుంబసౌభాగ్యం కోసం నిర్వహించిన నిత్య నరసింహ హోమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహచే ఆలయ అర్చకులు నంబి అరుణ్‌కుమార్, చక్రపాణి కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి యాగశాల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. యాగశాల వద్ద మంత్రికి ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాద వితరణ జరిపి, ప్రసాదాలు బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


వేములవాడలో స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న ఆలయ ఈవో వినోద్


ధర్మపురిలో పూజలందుకుంటున్న నర్సింహస్వామి


ధర్మపురిలో మంత్రి దామోదర రాజనర్సింహకు స్వామి వారి ఫొటోను అందజేస్తున్న ఎమ్మెల్యే,విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అధికారులు

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

- బ్రాందీ షాపుపై దాడి
- ముగ్గురిపై కేసు

కోల్‌సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఊర్వశి థియేటర్ సమీపం లోని మెగావైన్స్‌లో శనివారం రాత్రి ముగ్గురు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. వైన్స్‌లోని సిట్టింగ్ రూమ్‌లో మద్యం సేవించిన చింటు, మల్లికార్జున్, ఆరీఫ్ అనే యువకులు వైన్స్ కౌంటర్‌లోకి చొరబడి గొడవకు దిగారు. బీరు సీసాలు, ఇతర మద్యం బాటిళ్లను పడేశారు. కౌంటర్‌లోని వ్యక్తులను చంపుతామని బెదిరింపులకు గురి చేశారు. దీంతో మద్యంషాపు నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసు నమోదైంది. షాపులోని సీసీ పుటేజీలో ఈ దాడి దృశ్యాలు రికార్డు అయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తమదైన పద్ధతిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకోగా గొడవకు కారణమైన నిందితుడు మల్లికార్జున్ పరారీలో ఉన్నట్టు తెలుస్తున్నది.

హనుమాన్ జయంతి ఏర్పాట్లు షురూ..

- కొండగట్టులో 20 నుంచి ఉత్సవాలు
- సమన్వయ సమావేశం నిర్వహించని అధికారులు

మల్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయానికి రంగులు వేసే పనులు సాగుతున్నాయి. ప్రధాన ఆలయం రాజగోపురం, ప్రాకారం తదితర వాటికి రంగులు వేస్తున్నారు. ఈ పనుల పూర్తికి మరో ముడు రోజులకు పైగా పట్టనుండగా మిగతా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మరికొన్ని చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాటు చేసిన వాటినే కొనసాగించనున్నారు. అయితే చలువ పందిళ్ల కోతులతో, అకాల వర్షంతో దెబ్బతినగా వాటికి మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



కొండగట్టు అంజన్న ఆలయం

● సమన్వయ సమావేశం ఎప్పుడో..?

హనుమాన్ జయంతి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేసేందుకు గాను ప్రతి ఏటా నిర్వహించే సమన్వయ సమావేశం ఇంత వరకు నిర్వహించలేదు. దీంతో జయంతి ఏర్పాట్లపై ఎవరికి వారే అన్న తీరుగా మారుతోంది. ప్రతి ఏటా జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కొండగట్టుకు వస్తుంటారు. దీనికి గాను పదిహేను రోజుల ముందుగానే ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించి తగు చర్యలు చేపట్టడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఈసారి పెద్ద జయంతి వేడుకలకు మరో పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఉత్సవాల సందర్భంగా పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ, మిషన్ భగీరథ, ఆర్టీసీ, ఫైర్, నీటి పారుదల శాఖ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనుండగా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులలో ఇదివరకే నిమగ్నం కావాల్సి ఉంది. గత చిన్న జయంతి ఏర్పాట్లే ఇప్పుడు కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఉత్సవాల సందర్భాలలో ప్రతి ఏటా భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా సమన్వయ సమావేశం నిర్వహించి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



కొండగట్టు ఆలయానికి రంగులు వేస్తున్న సిబ్బంది

హుజూరాబాద్‌లో రూ.200 దొంగ నోట్ల కలకలం



వ్యాపారికి వచ్చిన దొంగ నోటు

హుజూరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అసలు, నకిలీ నోట్లకు తేడా లేకుండా పోతోంది. తాజాగా హుజూరాబాద్ పట్టణంలోని ఓ కిరాణం షాపులో సామాను తీసుకొని ఓ వ్యక్తి రూ.200 నోట్లు ఇచ్చారు. ఇది గమనించకుండా సదరు వ్యాపారి తీసుకొన్నాడు. వాటిని మరో వ్యక్తికి ఇస్తుండగా రెండు రూ.200నోట్లు నకిలీగా గుర్తించారు. దీంతో వ్యాపారి కంగుతిన్నాడు. దొంగనోట్లు కూడా అసలుకు తేడా లేకుండా ఉండడంతో లబోదిబోమన్నాడు. గతంలో కూడా రూ.500 దొంగ నోట్లు వచ్చిన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు దొంగ నోట్లపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ చరిత్రాత్మక విజయం



ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించిన టాపర్లతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థలు చరిత్రాత్మక విజయం సొంతం చేసుకున్నాయి. కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. బి వర్షిత్203, అదిబాఫిర్దోజ్ 206, ఎం ప్రణీత్ 250, కె మనోజ్‌కుమార్ 286, బి శ్రీనిత్య 296, జి కౌషల్‌ప్రియ 339, జి రిషిత 438, జె అనూష 447, కె అర్చన 485, ఎండి అబ్దుల్‌జిషాన్ 551, సిహెచ్ శ్రీనిధి 567, ఎంరోహిత్‌రెడ్డి 606,అబుఉమేర 614, హాస్నమహావిష్ 639, పి శ్రీనిత్యరెడ్డి 704, కె శ్రీరామ్ చరణ్732, కె హాసిని 735, రాంసకోరిన్ 738, డి సుమగ్నయ752, ఎల్ శరణ్య762, జి సింధు763, బి అభిజ్ఞ 801, జె వామిక 807, వి అక్షయ్ 831, డి హరిశంకర్ 838, బి భువనకృతి 839, ఎ శశిప్రీతమ్ 853, కె సాయిశ్రేయాన్‌రెడ్డి 908, వి హృషికేష్ 920, మహ్మద్ సర్ఫ్రాజ్ 927, కె గాయత్రి 992, ఎ శ్రీనిజరెడ్డి 997ర్యాంకు సాధించారు.33మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించగా, 72మంది విద్యార్థులు 2000లోపు ర్యాంకులు, 102 మందివిద్యార్థులు 3000లలోపు ర్యాంకులు, 192మంది విద్యార్థులు 5000లలోపు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించారని అభినందించారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో కూడా ఆల్ఫోర్స్ మంచి ఫలితాలు సాధించిందని తెలిపారు. 461 మంది విద్యార్థులు ఐఐటి మెయిన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. పటిష్టమైన ప్రణాళికతో బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో ఘనవిజయాన్ని సాధించామన్నారు. రానున్న ఐఐటీ అడ్వాన్స్, నీట్ పరీక్ష ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడానికి అధ్యాపకులు, తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉందని వారందరినీ అభినందిస్తున్నట్లు తెలిపారు.

● అధ్యాపకులు, తల్లిదండ్రుల సహకారంతో ర్యాంకు సాధించాను..

- అదిబఫిర్దోస్, 206 ర్యాంకు



మా నాన్న చిరువ్యాపారి అయినప్ప టికీ మమ్మల్ని బాగా చదివిస్తున్నారు. నేను ఈ ర్యాంకు సాధించడానికి తల్లి దండ్రుల సహకారం, అధ్యాపకులు కృషి ఎంతగానో ఉంది. ఎప్‌సెట్‌లో 206 ర్యాంకురావడం ఉత్సాహాన్నిచ్చింది. నీట్‌లోనూ మంచి ర్యాంకు సాధిస్తాను.

ట్రినిటి విద్యార్థుల విజయభేరి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్-2025 ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కబనరిచి ర్యాంకుల సాధనతో విజయభేరి మోగించారు. తమ విద్యార్థులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934, 1104, 1166, 1546, 1619, 1795, 1950 ర్యాంకులు సాధించినట్లు ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే 10 వేలలోపు 89 మంది ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్‌తో పాటు ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు.

ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

గణేశ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్ జోనల్‌ఇన్‌చార్జి నేదురు తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యున్నతమైన ఫలితాలను సాధించి ఎస్‌ఆర్ విద్యాసంస్థల కీర్తిని చాటిచెప్పిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఎం.వినయ్ 149వ ర్యాంకు, ఎం కార్తీక్ 234, జాబిరామ్ 471, సిహెచ్ హన్సిక 539, ఎం రాజా వర్షిత్‌రెడ్డి 564, బి.మాధవ్ 750,కె సంజయ్ 886,జి.శివసాయి,887,ఎన్ పూజిత1077, ఆదిత్య 1304, ప్రాశ్రిత్ 2179, వి అమూల్యశ్రీ 2457, ఎం. రుశీశ్వర్‌రెడ్డి 2672, జే.సహస్ర 3487, కె.తేజశ్రీ 5032, బి.నాగచైతన్య 5565, కె.జాహ్నవి3896, బి ఆదిత్య వర్ధన్5838, అంజిరెడ్డి 6527 , బి.ప్రవళిక 6797, కె.రాకేష్ 6999, మనుష 7052, డి సాయి చందన 7251, ఎం.సుమలత 8005, కటకం శ్రీలేఖ 8088, డి.రాజ్‌కుమార్8323, ఎన్ శ్రీచరణ్ జోషి 8522, అబ్దుల్ రాయన్9213, శివరామ్9333, ఎన్ సాయిశ్రీనిక 9542, బి సహస్ర 9851, రాష్ట్రస్థాయిలో అఖండ విజయాన్ని సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన వారి తల్లిదండ్రు లను, అధ్యాపకబృందానికి ఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈవో, డీజీఎం, జోనల్ ఇన్‌చార్జి, అకడమిక్ డీన్స్ ప్రిన్సిపాల్స్ శుభాకాంక్షలు తెలిపారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎస్‌ఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు

శ్రీచైతన్య విద్యార్థుల విజయఢంకా

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించారు. గోకులకొండ వైష్ణవి 810, బి మనోజ్ఞ 968, బి సాత్విక్ 1142, పి స్ఫూర్తిశ్రీ 1527, బి శ్రావణి 1803, పి బ్లెస్సీ సుసన్ 2106, పి చందన 2165, పి భరత్‌రెడ్డి 2815, పి అజితేష్ 3016, కె అనూహ్య 3503, వి ప్రవీణ్, వి రిషి 3996, జి అర్చన 4171, ఆర్ శ్రీయాన్ 4246, వి శివాణి 4570, బి స్రవంతి 4957తో పాటు 16 మంది విద్యార్థులు 5000లోపు, 51మంది విద్యార్థులు 10వేల లోపు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రణాళిక, అధ్యాపకుల కృషితో విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



వైష్ణవి (810 ర్యాంకు)



మనోజ్ఞ (968 ర్యాంకు)

శాతవాహన పరిధిలో 14నుంచి డిగ్రీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు టైం టేబుల్ ప్రకారం మే14 నుంచి యధావిధిగా జరుగుతాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా. డి సురేష్‌కుమార్ తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన కళాశాల విద్యార్థులకే పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా పరీక్ష ఫీజు చెల్లించని అనేక ప్రైవేటు కళాశాలలు 12వ తేదీలోగా ఫీజు చెల్లిస్తాయని భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఏజెఆర్ ఆటోమోటివ్స్

- ప్రారంభించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



ఏజెఆర్ ఆటోమోటివ్ షోరూంను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డులో విట్స్ కళాశాల ఎదురుగా బుల్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఏజెఆర్ ఆటోమోటివ్ షోరూం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ జోన్ హెడ్ వి సోమసుందరం, బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టేట్ హెడ్ ఎన్ సురేష్‌బాబు, షోరూం అథరైజ్డ్ డీలర్ అంబటి జోజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ బుల్ కంపెనీ ఒక స్టాండర్డ్ పోర్టు, స్టాండర్డ్ క్వాలిటీ, మంచి పెర్ఫార్మెన్స్‌తో ఉంటుందని తెలిపారు. కంపెనీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. లోడ్ వర్క్సుగానీ, ఇసుక వర్క్సుగానీ, మట్టి పనులకు ఎక్కడ అవసరం ఉన్నా ఈ కంపెనీని తప్పకుండా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. జోజిరెడ్డి మాట్లాడుతూ బుల్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్‌తో గంటకు లీడర్ డీజిల్ ఆదా అవుతుందన్నారు. ఇతర వెహికిల్స్‌కన్నా మెరుగైన పనితీరు, మెరుగైన క్వాలిటీతో ఉంటుందని తెలిపారు. సేవలు అవసరం ఉన్నవారు వెహికిల్ డెమో బుక్ చేసుకోవాలని కోరారు. అలాగే సర్వీస్ విషయంలో కూడా 100 శాతం క్వాలిటీతో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ జగ్గారెడ్డి, సంతోష్, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

జూపాకలో అగ్నిప్రమాదం

హుజూరాబాద్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపాక గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని వ్యవసాయక్షేత్రంలోని వరికొయ్యలకు నిప్పుపెట్టడంతో మంటలు పెద్దఎత్తున వ్యాప్తించాయి. ఈ మంటలు కాస్తా ఇళ్ల సమీపంలోకి వ్యాపించడంతో గ్రామస్థులు వెంటనే బకెట్లతో మంటలను గ్రామస్థులు ఆర్పారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి మంటలను పూర్తిగా ఆర్పేశారు.

- ఉపాధి ఆధారంగా మారుతున్న నామధేయాలు
- అసలు పేరు కొసరుగా మారుతున్న వైనం



జమ్మికుంట రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన ఇద్దరు చిన్ననాటి మిత్రులు చాలాకాలం తర్వాత ఓ శుభకార్యంలో కలుసుకున్నారు. బడిలో కలిసి చదు వుకున్న జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. యాంత్రిక జీవనంలో ఇన్నాళ్లు గడిపిన మిత్రుల మధ్య మళ్లీ మాటల చాటింగ్‌లు పెరిగాయి. ఓ రోజు శ్రీనివాస్ అనేమిత్రుడు అనుకోకుండా జమ్మికుంటకు వచ్చాడు. పని పూర్తి చేసుకున్న అనంతరం తన చిన్ననాటి స్నేహితుడైన పొనగంటి సంపత్‌ను కలవాలని అనుకున్నాడు. వెంటనే మిత్రుడికి ఫోన్‌చేశాడు.. కలవడం లేదు. సరేలే అని ఇంటికి వెళ్దామని బయల్దేరాడు. సంపత్ ప్రస్తుతం అక్కడ ఉండటం లేదు. ఈ విషయం తెలియడంతో అక్కడ ఉన్న వారిని అడిగాడు. పొనగంటి సంపత్ అనే వ్యక్తి ఇక్కడ ఉండడని వారు తెలిపారు. దీంతో నిరాశగా తిరుగుప్రయాణం అయ్యాడు. తర్వాత ఈ విషయం తన మిత్రుడికి ఫోన్‌లో వివరించాడు. అప్పుడు సదరు మిత్రుడు సంపత్ అసలు విషయం చెప్పాడు. ఒరేయ్ నేను జేసీబీ(ఎక్స్‌కావేటర్) కొన్నాను. అప్పటి నుంచి నన్ను అందరూ ఇంటి పేరు కాకుండా పేరు పక్కన జేసీబీ సంపత్ పిలుస్తారు. అలా నా ఇంటి పేరు, నాపేరును నాకు తెలియకుండానే మార్చేశారు. మా ప్రాంతంలో జేసీబీ సంపత్ అంటేనే అందరికీ తెలుసని చెప్పాడు. పాతికేళ్లుగా తనవృత్తి తనఇంటి పేరుగా ముద్ర పడిపోయిందని సమాధానం ఇచ్చాడు. ఇలా జమ్మికుంటలో చాలామంది ఇంటిపేర్లు మారిపోయాయి. వారు చేస్తున్న పనే వారి ఇంటి పేరుగా మారింది. వారి ఇంటి పేర్లతో పిలిస్తే ఎవరికీ తెలియదు. వారు చేస్తున్న పని పేరు చెప్పి పిలిస్తేనే అందరికీ అర్థమవుతుంది. అటువంటి వారి గురించి ఓ సారి తెలుసుకుందాం..



జేసీబీ కొన్నాను.. అదే నా ఇంటి పేరుగా మారింది..

- పొనగంటి సంపత్, జమ్మికుంట


వ్యాపార అవసరాల కోసం 28 ఏళ్ల క్రితం జేసీబీ కొన్నాను. జమ్మికుంట పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం, పూడికతీత, కాంట్రాక్ట్ పనులు చేసేవాడిని. జమ్మికుంట ప్రాంతంలో మొట్టమొదటిసారి జేసీబీ కొనుగోలు చేయడంతో నాపేరు జేసీబీ సంపత్‌గా మారిపోయింది. ఇప్పుడు పొనగంటి సంపత్ అంటే ఎవరికీ తెలియదు. జేసీబీ సంపత్ అంటే చిన్నపిల్లాడైనా గుర్తుపడతాడు.



వ్యాపారమే నా ఇంటి పేరుగా మారింది

- కర్రె సుబ్బారావు, జమ్మికుంట

జమ్మికుంటలో 40 సంవత్సరాలుగా షాబాద్ బండ వ్యాపారం చేస్తున్నాను. దీంతో నా ఇంటి పేరు బండ సుబ్బారావుగా మారిపోయింది. ఈ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకు నా ఇంటి పేరు ఎవరికీ తెలియదు. నా పేరు బండ సుబ్బారావు అని పిలిస్తేనే అందరికీ తెలుస్తుంది.



నన్ను పొగాకు కొండయ్య అనే పిలుస్తారు..

- మురికి కొండయ్య, జమ్మికుంట

20 సంవత్సరాల క్రితం పొగాకు వ్యాపారం చేశాను. తర్వాత ఎలక్ట్రికల్ షాప్ పెట్టుకున్నాను. మొదట పొగాకు వ్యాపారం చేశాను కాబట్టి నా పేరు పొగాకు కొండయ్యగా మారిపోయింది. నా సొంత ఇంటి పేరు మురికి కొండయ్య అంటే ఎవరికీ తెలియదు. ఎలక్ట్రికల్ షాపు పెట్టుకున్నప్పటికీ పొగాకు కొండయ్య అని పిలుస్తారు.

● న్యూస్ బాక్స్

నేడు 145వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 11: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నగరంలోని రాంనగర్ అభయాంజనేయ స్వామి ఆలయ కల్యాణ మండపం సమీపంలోని కథా రచయిత డాక్టర్ బీవీఎన్ స్వామి నివాసంలో 145వ ఎన్నీల ముచ్చట్లను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీప్రియులు చిన్న కథలు, మినీ కవితలతో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 11: నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం 10-30 గంటలకు శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ కందుల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి సహస్రదీపాలంకరణ, గరుడ వాహన సేవలుంటాయని, గరుడ వాహనం ప్రకాశంగంజ్, టవర్‌సర్కిల్, రాజీవ్ చౌక్ ద్వారా తిరిగి ఆలయం చేరుకుంటుందని పేర్కొన్నారు. కల్యాణ దాతలుగా కూర్చునేవారు ఆలయంలో సంప్రదించాలని కోరారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

భగత్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బాల సంస్కార్-2025 వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో సిపి నిరంజనాచారి, గాజుల రవీందర్, మధుసూదన్ రావులు పాల్గొని మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలు నిత్య జీవితంలో ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ముఖ్యంగా ఆసనాలు, సూర్యనమస్కారాలు, దేశభక్తి పాటలు, సంస్కృతంలో స్వీయ పరిచయం, భజన, పిల్లల మధ్య సఖ్యత, జట్టు విధానం వంటివి విద్యార్థులను ఉన్నత మార్గం వైపు నడిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవాహ చామ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాశ్ జన్మదిన వేడుకలు

భగత్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాశ్ జన్మదిన వేడుకలు నగరంలోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లోని హనుమాన్ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది హనుమాన్ దీక్షాదారులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, హనుమాన్ దీక్షాదారులు తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలి

● సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి


కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలో లేని సమయంలో, కష్టకాలంలో కాంగ్రెస్ జెండా మోసిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం సుడా చైర్మన్‌ను కలిసిన నాయకులు, కార్యకర్తలు ఈ మేరకు వినతిపత్రాలను అందజేశారు. డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులకు తాము ప్రతిపాదించిన మేరకు నిధులు కేటాయించాలని, సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములను చేయాలని కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణలను కూడా కలిసి వినతిపత్రాలు అందించనున్నట్లు వెల్లడించారు. పార్టీ అధికారంలో లేనప్పుడు జెండా మోసి, పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నామని, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుని ధర్నాల్లో పాల్గొని కేసులు ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని, పోటీకి సిద్ధంగా లేనివారికి నామినేటెడ్ పదవులు ఇప్పించాలని మూకుమ్మడిగా వినతిపత్రం ఇచ్చారు.

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి ఘన స్వాగతం


మంత్రి దామోదర రాజనర్సింహకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో కరీంనగర్‌లో ఆయనకు మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులున్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లిన మంత్రి దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్‌పార్టీ నేతల కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు.

ఆకట్టుకున్న చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జ్యోతినగర్ జీనియస్ చెస్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్, అండర్-15 విభాగంలో నిర్వహించిన చదరంగ పోటీలకు విశేష స్పందన లభించింది. దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ రమణమూర్తి పాల్గొన్నారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య మాట్లాడుతూ చదరంగం క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యూరో ఫిజీషియన్ డాక్టర్ వెంకట్, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్, సృజన్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు ఉన్నారు.

వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

చొప్పదండి, మే 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తాటిపెల్లి అంజయ్య, గౌరవాధ్యక్షులుగా గుర్రం సంజీవరెడ్డి, వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎలిగేటి సురేష్, మహేశుని మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా దండె లింగన్న, జాయింట్ సెక్రెటరీగా దండె సత్యానందం, సిరిపురం తిరుపతి, మొలు మారి రమేష్, కోశాధికారిగా దూస రాము, ప్రచార కార్యదర్శిగా బొద్దుల కిషన్‌లు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా పిట్టల లచ్చన్న, దూంపేటి వెంకటేశం, కాసం శ్రీనివాస్, మంచికట్ల విఠల్, సంబోజి రాజేష్, పోతు రాజు, తొడుపునూరి లక్ష్మయ్య, ముద్దం తిరుపతి, గుర్రం చంద్రారెడ్డి, యామ పోచ మల్లయ్య, యెన్నం లహరి, బొల్లం సాంబమూర్తి, ఎండీ జహీర్, యెలిగేటి నాగరాజులు ఎన్నికయ్యారు. అలాగే సలహాదారులుగా గుర్రం హన్మంతరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, కొల్లూరి ఆనందం, కటు కం మల్లిఖార్జున్, వడ్లూరి లచ్చయ్య, పెరుమాండ్ల గంగయ్య, సామల రాజు, చీకట్ల కుమార్‌లను ఎన్నుకున్నారు.

'పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద పాకిస్తాన్‌పై భారత్ కఠినంగా వ్యవహరించాలని ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. ఆదివారం ఆయన ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌తో పాక్ ఉగ్రమూకల అంతమే లక్ష్యంగా ధర్మపోరాటంలో అగ్రరాజ్యం అమెరికా హిత ప్రవచనాలతో భారత్ వెనకడుగు వేయడాన్ని మెజారిటీ దేశ ప్రజలు హర్షించలేకపోతున్నారని అన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకొని, పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పినపుడే సీమాంతర ఉగ్రవాదానికి తెరపడుతుందన్నారు. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో, దూసుకుపోతుండడం, స్వయం సమృద్ధితో బలంగా ఎదగడం ఇష్టంలేని కొన్ని దేశాలు పాకిస్తాన్‌ను పావుగా వాడుకొని మనపై ఉసిగొలుపుతున్నాయని ఆరోపించారు. ఇండియా దెబ్బకు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌ను కోల్పోయిందని, కార్గిల్ యుద్ధంలో భారత్ చేతిలో పాకిస్తాన్ తీవ్ర భంగపాటుకు గురైందన్నారు.

కాలువ మరమ్మతులు ప్రారంభం


కాలువ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కరీంనగర్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో పెద్ద చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే కాలువ మరమ్మతులు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కోరారు. ఆయన వెంటనే స్పందించి 18లక్షల 80వేల రూపాయల నిధులను కేటాయించారు. సుమారు 600 ఎకరాల పంట పొలాలకు సాగు నీటిని అందించడం కోసం కొత్తగా కాలువ నిర్మాణ పనులను ఆదివారం గ్రామ మాజీ ఎంపీటీసీ వరి భద్రయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేశ్వర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దావు రవితేజ, బత్తిని దిలీప్ గౌడ్, బాబు, మల్లేశం, వరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 11 : జిల్లా కేంద్రంలోని సెయింట్ మార్క్ చర్చి గ్రౌండ్‌లో స్థానిక సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు ఆదివారంతో ముగిసాయి. వైజాగ్‌కు చెందిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ప్రవచకుడు డాక్టర్ ఎం జేమ్స్ స్టీఫెన్ ప్రసంగించారు. ఏసు క్రీస్తు చూపిన మార్గంలో అందరూ పయనించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, సహనము, ప్రేమ, మానవత్వం, ఐక్యతతో మెలగాలని పేర్కొన్నారు. మంచి మాటలు వినడమే కాకుండా వాటిని ఆచరణలో పెడితే జీవితాలన్నీ మంచిగానే ఉంటాయని అన్నారు. క్వాయర్స్ బృందం భక్తి గీతాలు ఆలపించాయి. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అధ్యక్ష మండల బిషప్ డాక్టర్ కె రూబెన్ మార్క్, డాక్టర్ ప్రెసిల్ల పరిమళ రూబెన్ మార్క్, పాల్ కొమ్మాలు, ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బి ప్రసాద్, ఎ మధుమోహన్, పింటు, రోజి, ఎస్ సత్యానందం, రెనాల్డ్, తిమోతీ జయరాజ్, క్రిస్టోఫర్‌తో పాటు ఇండిపెండెంట్ పాస్టర్స్, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, ఇవాంజిలిస్టులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సుభాష్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): మేముసైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాలసిస్ పేషంట్‌కు నిత్యావసర సరుకులను అందజేశారు. చిన్నారి సుదేష్ణ పుట్టినరోజును పుర స్కరించుకొని వారి తల్లిదండ్రులు యమున, శ్రీధర్ దంపతులు డయాలసిస్ పేషంట్‌కు నిత్యావసర సరుకులను అందచేశారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో సీఎస్‌కేఐ క్రీడాకారులకు పతకాలు



అంతర్జాతీయ పోటీల్లో పతకాలతో సీఎస్‌కే క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): మలేషియాలోని ఐపో నగరంలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగిన అంతర్జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నగరంలోని సీఎస్‌కేఐ అకాడమీకి చెందిన ముగ్గురు క్రీడాకారులు పాల్గొని ఐదు పతకాలు సాధించారు. సీనియర్ బాలికలు 19 సంవత్సరాల కటా విభాగంలో ఎం హాసిని గోల్డ్ మెడల్, కుమిటీలో సిల్వర్ మెడల్, బాలుర 16 సంవత్సరాల కుమిటీ విభాగంలో అబ్దుల్ రహీం గోల్డ్ మెడల్, సబ్ జూనియర్ బాలుర 14 సంవత్సరాల కటా విభాగంలో సయ్యద్ మహ్మద్ కుమిటీలో సిల్వర్ మెడల్, కటాలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు సీఎస్‌కేఐ ఫౌండర్, ఇండియా చీఫ్ ఇ శ్రీనివాస్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సీఎస్‌కేఐ చైర్మన్ చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, మెంబర్ ఆర్ ప్రసన్నకృష్ణ, జీఆర్ఆర్ అకాడమీ చీఫ్ గౌరు రాజిరెడ్డి అభినందించారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం


హనుమాన్ చాలీసాలో పాల్గొన్న మాజీ మంత్రి గంగుల కమలాకర్

భగత్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలోని శ్రీరామ భక్త హనుమాన్ సహిత గణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణ బృంద సభ్యులు పెరుమాండ్ల కమల్‌గౌడ్ ఆధ్వర్యంలో 108 సార్లు పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు మహేందర్‌రెడ్డి, కర్ర సూర్యశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ పెరుమాండ్ల మొండయ్యగౌడ్, గురుస్వాములు రమణాచార్యులు, తిరుపతిగౌడ్, కమల్‌గౌడ్, సాయికృష్ణ, రాజు, విక్రమ్, హనుమాన్ దీక్షాదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఆదివారం విడుదల చేసిన ఎప్సెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పట్టణానికి చెందిన మహ్మద్ రిఫాహ్ ఉర్ రహ్మాన్ 309ర్యాంక్, మంచికట్ల సాయివివేకానంద 777 ర్యాంక్ సాధించారు. అలాగే ఈఏడాదిలో జరిగిన జేఈఈ మెయిన్స్‌లో రహ్మాన్ 99.58, సాయి వివేకానంద 99.41శాతం సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు.

అగ్రికల్చర్‌అండ్‌ఫార్మసీ విభాగంలో 869 ర్యాంక్


గంప ప్రజ్ఞాని

శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన గంప ప్రజ్ఞాని ఆదివారం ప్రకటించిన ఈఏపీ సెట్ ఫలితాల్లో అగ్రికల్చర్‌అండ్‌ఫార్మసీ విభాగంలో 90.159 మార్కులతో 869ర్యాంక్ సాధించింది. ప్రజ్ఞాని అలుగునూర్ సీవోఈలో బైపీసీ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకుంది. ఈ ఎప్‌సెట్ ద్వారా 869ర్యాంక్ సాధించడంతో ప్రజ్ఞానిని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు.

14న జాబ్ మేళా

చొప్పదండి, మే 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఈనెల 14న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ క్రాంతికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024, 2025 విద్యాసంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకున్న ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, ఒకేషన్ విభాగంలో 750మార్కులపైన సాధించిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైనవారికి ఉద్యోగంతో పాటు డిగ్రీచదివే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు జాబ్‌మేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్ తెచ్చుకోవాలని కోరారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం

గంగాధర, మే 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని తాజామాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి అన్నారు. సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం గట్టుబూత్కూర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని పేదలకు, రైతులకు ఈలాంటి వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. 312 మందికి ఉచిత బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

పహల్గాం ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే

● సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

గన్నేరువరం, మే 11 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన సంఘటనకు కేంద్రప్రభుత్వ వైఫల్యమే కారణమని సీపీఐజిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల 3వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ పాలనలో కార్పొరేట్‌శక్తులకు మేలు జరిగిందని, పేదలకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు.

చొప్పదండి ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం

చొప్పదండి, మే 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సీపీఎల్ పోటీలను మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ ప్రారంభించారు. మండలం నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి జట్లు ఈ లీగ్‌లో పాల్గొంటాయని నిర్వాహకుడు మరిమడ్ల రాజిరెడ్డి తెలిపారు.

కమీషన్ చెల్లిస్తేనే పుస్తకాలు!

● బుక్‌స్టాల్స్‌కు పలు విద్యాసంస్థల అల్టిమేటం



జమ్మికుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పలువిద్యాసంస్థల యాజమానులు నోట్ పుస్తకాల దందాకు తెరతీస్తున్నారు. గతంలో మాదిరిగా విద్యాసంస్థల ఆవరణలో విక్రయించకుండా బుక్‌స్టాల్స్‌కు కమీషన్ బేసిక్‌గా ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎన్ని పేజీల నోట్ పుస్తకాలకు ఎంత ధర, వాటి ఎమ్మార్పీ, ఎంత పర్సంటేజ్ లాభం తదితర విషయాలు మాట్లాడుకు న్నట్లు సమాచారం. ఏ తరగతికి ఎన్ని పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌ బుక్‌లు కావాలనే విషయమై పలు విద్యాసంస్థల యజమానులు ఇప్పటికే కంపెనీల ప్రతినిధులకు లిస్టులు అందజేసినట్లు సమాచారం.

● ఏ బుక్‌స్టాల్‌కు ఎన్ని సెట్లు!

ఏ బుక్‌స్టాల్‌కు ఎన్నిసెట్లు ఇవ్వాలనేది మాత్రం సదరు విద్యాసంస్థ అధినేత నిర్ణయిస్తాడు. ఒక బుక్‌స్టాల్‌కు ఎన్నిసెట్లు ఇవ్వాలనే విష యమై కంపెనీ ప్రతినిధులకు ముందుగా సూచిస్తున్నారు. దానిప్రకారమే డిస్ట్రిబ్యూటర్ ద్వారా బుక్‌స్టాల్స్‌కు బుక్‌ల సెట్లు దిగుమతి అవుతాయి. అయితే ఒక్కోపాఠశాల తరగతి బుక్‌సెట్లు ఒక్కో మాదిరిగా ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులు మరోచోట కొనుగోలు చేసే అవకాశం లేకుండా చేస్తారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు భారం పడుతుంది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి కమీషన్‌బేస్ దందాకు అడ్డుకట్టవేసి, విద్యా ర్థుల తల్లిదండ్రులకు మేలు చేకూరేలా చర్యల చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

● విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు భారం వేయొద్దు
- మంథని హేమలత, ఎంఈవో, జమ్మికుంట

ప్రైవేట్ పాఠశాలల యాజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలి. విద్యార్థుల తల్లిదండ్రులపై ఇష్టం వచ్చినట్లు పుస్తకాల భారం వేయొద్దు. బుక్‌స్టాల్స్ యాజమానులు నోట్ పుస్త కాలు కొనుగోలు చేసిన విద్యార్థులకు ఒర్జినల్ రశీద్ ఇవ్వాలి. రశీద్‌పై బుక్‌స్టాల్ స్టాంప్, సంతకం తప్పకుండా ఉండేట్లు చూడాలి. విద్యార్థుల తల్లిదండ్రులు వాటన్నింటినీ తప్పకుండా చూసుకోవాలి.

క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయి

గంగాధర, మే 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని గంగాధర ఇన్‌చార్జి ఎస్సై స్వాతి అన్నారు. ఆదివారం గంగాధర జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో జరుగుతున్న సమ్మర్ క్రికెట్‌క్యాంపు కార్యక్రమానికి ఆమె హాజరైన క్రీడాకారులకు టీ షర్టులను పంపిణీ చేశారు. యువత మత్తు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు ఠాగూర్, గంట విజయ్, కట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపకాల్వ బ్రిడ్జి రక్షణ గోడకు మరమ్మతులేవి?


లలితాపూర్‌లో కూలిన ఎస్సారెస్పీ ఉపకాల్వ బ్రిడ్జి రక్షణ గోడ

మానకొండూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామంలో గల ఎస్సారెస్పీ ఉపకాల్వ బ్రిడ్జి రక్షణగోడ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఎల్ఎండీ నుంచి ఖమ్మం వరకు వెళ్లే కాకతీయ ప్రధానకాల్వ మండలంలోని దేవంపల్లివద్ద డీబీఎం6 ఉపకాల్వ తూం ఉంది. ఈ ఉప కాల్వ మండలంలోని దేవంపల్లి, లలితాపూర్, పచ్చునూర్, వీణవంక మండలంలోని పలుగ్రామాలతోపాటు జమ్మికుంట మండలంలోని పలుగ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. అయితే లలితాపూర్-దేవంపల్లి గ్రామాల కాల్వపై నిర్మించిన బ్రిడ్జి రక్షణగోడ రెండు వరుసలు కూలిపోయాయి. ఈ రోడ్డు వెంబడి లలితాపూర్, దేవంపల్లి, కెల్లేడు, కొండపల్కల, మద్దికుంట తదితర గ్రామాల ప్రజలు ద్విచక్రవాహనాలు, ఆటోలలో ప్రయాణిస్తుంటారు. పంటలకు సాగు నీరును సరఫరా చేసే సమయంలో కాల్వ నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతూ పోతుంటాయి. దీంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. వేసవిలోనైనా రక్షణ గోడల మరమ్మతులు చేపట్టాలని ఎస్సారెస్పీ అధికారులను కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1998-99వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

జమ్మికుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో 1998-99లో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు పట్టణంలోని వినాయక గార్డెన్‌లో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నాటి విద్యార్థుల్లో ఒకరైన దొడ్డె ఆంజనేయులు కలెక్టర్ కాగా, నరేందర్‌గౌడ్ ఆర్మీసోల్జర్ అయ్యారు. వారు ఈ కార్యక్రమానికి ప్రత్యేకఆకర్షణగా నిలిచారు. ఈసందర్భంగా తోటిమిత్రులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

గంగాధర, మే 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని స్వామివివేకానంద విద్యాపరిషత్‌ట్రస్ట్ డైరెక్టర్, ఐఎంఏరాష్ట్ర సంయుక్తకార్యదర్శి డాక్టర్ పొలాసరామ్‌కిరణ్ అన్నారు. పదిరోజులుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యోగా శిక్షణశిబిరం నిర్వహిస్తున్నారు. శిక్షణముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణతో కూడినవిద్య ఉన్నతంగా నిలబెడుతుం దన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది రమేష్‌బాబు, యోగా గురువు సంపత్‌కుమార్, డాక్టర్లు శేషశైలజ,సురేంద్ర, సీఏఅనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..సీఐ

చిగురుమామిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అన్ని విధాలుగా, అన్ని సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. పాకిస్థాన్, ఇండియామధ్య జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో ఆదివారం మండలకేంద్రంలో పోలీస్‌కవాతు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేశారు.


పరామర్శ

జమ్మికుంట రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో ఇటీవల వివిధకారణాలతో భోగ రాములు, కోడెపాక దుర్గప్రసన్న మృత్యువాత పడ్డారు. ఆదివారం మృతుల కుటుంబాలను మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరిస్వప్న పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలవేసినివాళులు అర్పించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన స్వర్గం శివకుమార్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరగా వైద్యం ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కింద దరఖాస్తు చేసుకోగా రూ.38వేల చెక్కును శనివారం యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పంజాల అరవింద్‌గౌడ్ ద్వారా అందజేశారు.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు

శంకరపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్‌లో తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా, కూతురు అంత్యక్రియలు నిర్వహించింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతు లక్ష్మీనారాయణ (37)కు ఇద్దరు కూతుళ్లు ప్రవస్థి, ప్రశస్థి ఉన్నారు. కొంతకాలంగా లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం మృతిచెందాడు. పెద్దకుమార్తె ప్రవస్థి తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలను నిర్వహించింది. సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది.